క్లుప్తంగా

పోలీస్ స్టేషన్ ఆకస్మిక తనిఖీ



స్టేషన్ పరిసరాలను పరిశీలిస్తున్న డీఎస్పీ చంద్రభాను

టేకులపల్లి: ఇల్లెందు డీఎస్పీ నునావత్ చంద్రభాను ఆదివారం టేకులపల్లి పోలీస్ స్టేషన్‌ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. వివిధ కేసుల్లో పట్టుబడిన, ప్రమాదాల కారణంగా స్టేషన్‌కు తీసుకొచ్చిన వాహనాల వివరాలు తెలుసుకుని వాటిని క్లియరెన్స్‌కు కృషి చేయాలన్నారు. రోజువారి కేసులు, వాటి పరిష్కార ప్రగతిని పరిశీలించారు. స్టేషన్‌కి వచ్చే ప్రతీ ఒక్కరితో మర్యాదగా వ్యవహరించాలని, వారు ఇచ్చే ఫిర్యాదులను తక్షణమే స్వీకరించి కేసులు నమోదు చేసి దర్యాప్తు వేగవంతం చేయాలని సూచించారు. సమాజంలో విచ్చలవిడిగా పెరిగిపోతున్న అసాంఘిక కార్యకలాపాలు, గంజాయి తదితర నిషేధిత పదార్థాల వల్ల కలిగే నష్టాలపై గ్రామాల్లో, విద్యాలయాల్లో అవగాహన కల్పించాలని తెలిపారు. స్టేషన్ ఆవరణలో పరిసరాల పరిశుభ్రత, పచ్చదనం పట్ల సంతృప్తి వ్యక్తం చేస్తూ మరింత పచ్చదనం ఉండేలా చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్‌ఐ రాజేందర్ పాల్గొన్నారు.

ఉద్యోగుల సంఘం కమిటీ ఎన్నిక



కమిటీని ప్రకటిస్తున్న వెంకటేశ్వర్లు

ఇల్లెందురూరల్: తెలంగాణ పంచాయతీరాజ్ నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం ఇల్లెందు సమితి నూతన అధ్యక్షుడిగా సంతోష్‌కుమార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో ఆదివారం నూతన కమిటీని ఎన్నుకున్నారు. ప్రధాన కార్యదర్శిగా కిరణ్, ఉపాధ్యక్షుడిగా ఎస్‌కే మదార్ ఖాన్, సహాయ కార్యదర్శిగా రవళి, కోఆప్షన్ సభ్యుడిగా మునీర్‌పాషా, గౌరవ అధ్యక్షుడిగా రాజయ్య ఎన్నికయ్యారు. ఎన్నికలను సంఘం జిల్లా అధ్యక్షుడు పులికంటి వెంకటేశ్వర్లు పర్యవేక్షించారు.

బీజేపీ ఆధ్వర్యంలో హర్ ఘర్ తిరంగా



తిరంగా యాత్రలో నాయకులు

టేకులపల్లి: 79వ భారత స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఈ నెల 15వ తేదీలోపు ప్రతీ ఇంటిపై త్రివర్ణ పతాకం ఎగిరేలా ప్రతీ కార్యకర్త, నాయకుడు కృషి చేయాలని బీజేపీ అనుబంధ గిరిజన మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి భూక్యా శ్రీను పిలుపునిచ్చారు. ఈ మేరకు హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా ఆదివారం మండల కేంద్రంలో తిరంగా యాత్ర నిర్వహించారు. ప్రధానమంత్రి మోదీ చేస్తున్న అభివృద్ధిని వివరిస్తూ ప్రచారం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో వి.హతీరాం, పూన్యా, రవి రాథోడ్, బాలాజీ, వెంకటేశ్వర్లు, ద్రావ్ సింగ్, సత్యం, ఇస్లావత్ రాములు, సురేష్, నాగేందర్ ప్రసాద్, రాందాస్, అప్పారావు, అన్వేష్, మూర్తి, రాజు నాయక్, బోడ గంగాబాయి పాల్గొన్నారు.

ఫిల్టర్ బెడ్ నిర్వహణ అస్తవ్యస్తం

నీటి శుద్ధి కరువు?
- సమయపాలన లేకుండా నీటి సరఫరా
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు

పాల్వంచ: కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని పాల్వంచ డివిజన్‌లో తాగునీటి సరఫరా అస్తవ్యస్తంగా మారింది. నీటిని శుద్ధి చేయడంలో సరైన నిబంధనలు పాటించడం లేదు. అంతేగాక ప్రతీరోజు నీటి విడుదల చేయడం లేదు. ఒక్కోసారి వారం రోజులు వరకు నీళ్లు వదలని పరిస్థితి. ఇక్కడ సరైన ల్యాబ్ టెక్నీషియన్లు కూడా లేక పోవడంతో నీటి శుద్ధిపై స్థానికులు పెదవి విరుస్తున్నారు.

అధ్వానంగా ఫిల్టర్ బెడ్ నిర్వహణ...

మొత్తం 26 వార్డులు ఉండగా సుమారు లక్ష జనాభాకు కిన్నెరసాని రిజర్వాయర్ నుంచి వచ్చే నీటిని కరకవాగు ఫిల్టర్ బెడ్‌కు పంపించి అక్కడి నుంచి పైపులైన్ల ద్వారా తాగునీటిని సరఫరా చేస్తున్నారు. అయితే ఇక్కడి ఫిల్టర్ బెడ్ నిర్వహణ అధ్వానంగా తయారైందనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. సామాజిక మాధ్యమాల్లో సైతం ప్రజలు నిర్వహణ తీరుపై విమర్శలు గుప్పిస్తున్నారు. మంచినీటి పైపులైన్లలో వచ్చే నీరు మురుగుగా వస్తున్నాయి. బిందెల్లో నీటిని పట్టుకుంటే కాసేపటికి అడుగున మట్టి చేరి కనిపిస్తోంది. ఇక డివిజన్ పరిధిలో పలుచోట్ల పైపులైన్ల లీకేజీలకు అంతే లేదు. పైపులైన్ల లీకుల్లోకి బురద నీరు చేరి కలుషితం అవుతున్నాయి. ఈ నీళ్లు తాగిన స్థానికులు అనారోగ్యం బారిన పడుతున్నామని వాపోతున్నారు. అసలే వర్షాకాలం నీటి శుద్ధి సక్రమంగా చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

ల్యాబ్ టెక్నీషియన్ లేకుండానే...

ఫిల్టర్ బెడ్‌లో నీటిని శుద్ధి చేసేందుకు వాడే ఆలం క్వాలిటీ ఉండటం లేదని పలువురు వాపోతున్నారు. ల్యాబ్‌లో నీటి పరీక్షలు చేసిన తర్వాత సరఫరా చేయాల్సి ఉండగా ల్యాబ్ నిర్వహణ మరుగున పడింది. ఇక్కడి ట్యాంక్ శుద్ధి అంతంత మాత్రంగానే ఉంది. ఇక డ్రెయినేజీ నిర్వహణ అధ్వానంగా మారింది. ఫిల్టర్ బెడ్ పరిసరాల్లో పిచ్చిచెట్లు భారీగా పెరిగాయి. రాత్రివేళల్లో ఇక్కడి సిబ్బంది మోటర్లు వేసి వదిలేస్తున్నారు. దీంతో ట్యాంక్ నిండుకుని ఒక్కోసారి నీళ్లు పొర్లిపోతున్నాయని స్థానికులు చెబుతున్నారు. ఇక మోటార్లు, పరికరాలు తుప్పు పట్టాయి.



ఫిల్టర్ బెడ్‌లో తుప్పు పట్టిన పరికరాలు



కరకవాగు ఫిల్టర్ బెడ్

నీటి శుద్ధి సరిగా చేయడం లేదు...



కరకవాగు ఫిల్టర్ బెడ్‌లో నీటి శుద్ధి సక్రమంగా చేయడం లేదు. పైపులైన్ల నుంచి వచ్చే తాగునీరు మురికిగా వస్తున్నాయి. బిందెల్లో నీళ్లు పట్టుకుంటే అడుగున మట్టి పేరుకపోతోంది. ఫిల్టర్ బెడ్ నిర్వహణ లోపభూయిష్టంగా మారింది. ఇప్పటికైనా అధికారులు నీటి శుద్ధిపై చర్యలు తీసుకోవాలి.

– నరేశ్, కరకవాగు

అనారోగ్యం పాలయ్యే అవకాశం ఉంది..



నీటి శుద్ధి సక్రమంగా లేకపోవడంతో మురుగు నీరు వస్తున్నాయి. ఆ నీటిని తాగిన స్థానికులు తరచు అనారోగ్యాల బారిన పడుతున్నారు. పైపులైన్ల లీకేజీలు సైతం పట్టణంలో అనేక చోట్ల ఉన్నాయి. అధికారులు పైపులైన్ల లీకేజీలను అరికట్టాలి. ఎన్నిసార్లు చెప్పినా ఎవరూ పట్టించుకోవడం లేదు.

– శ్రీలత, పాల్వంచ

నేడు ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ



మాట్లాడుతున్న డాక్టర్ వెంకటేశ్వర్లు

జూలూరుపాడు: జాతీయ నులి పురుగుల నిర్మూలన దినోత్సవం సందర్భంగా 1–19 సంవత్సరాల వయస్సు గల పిల్లలకు సోమవారం ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ చేయనున్నట్లు పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ బి.వెంకటేశ్వర్లు తెలిపారు. ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ... కడుపులో నులి పురుగులు ఉన్న పిల్లలు పోషకాహార లోపం, రక్తహీనతతో అలసిపోతుంటారని, అదేవిధంగా శారీరక, మానసిక అభివృద్ధి మందకొడిగా ఉంటుందన్నారు.

నులి పురుగుల నిర్మూలన మాత్ర పిల్లలు, పెద్దలు మింగడం ఎంతో సురక్షితమైందన్నారు. ప్రభుత్వాస్పత్రి, అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలలు, కళాశాలల్లో పిల్లలకు ఆల్బెండజోల్ ట్యాబెట్లు మింగించడం జరుగుతుందన్నారు. మండల వ్యాప్తంగా 1–19 సంవత్సరాల వయస్సు గల పిల్లలు 6,581 మందికి ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేయడమే లక్ష్యమన్నారు. ఏఎన్‌ఎంలు, ఆశాకార్యకర్తలు, అంగన్‌వాడీ టీచర్లు, ఉపాధ్యాయులను డీవార్మింగ్ ప్రోగ్రాంలో పాల్గొననున్నట్లు చెప్పారు. జూలూరుపాడు హైస్కూల్‌లో జరగనున్న డీవార్మింగ్ డే ప్రోగ్రాంకు వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించనున్నట్లు చెప్పారు.

సింగరేణిలో స్పెషలిస్ట్‌లతో వైద్యశిబిరం



డాక్టర్లు రాకపోవడంతో నిరీక్షిస్తున్న పేషెంట్లు

సింగరేణి(కొత్తగూడెం): ఏఐటీయూసీ నాయకుల వినతి మేరకు సింగరేణి ఆస్పత్రిలో ఆదివారం స్పెషలిస్ట్ డాక్టర్లు ప్రజలకు వైద్యం అందించారు. సింగరేణి వ్యాప్తంగా ఆస్పత్రులలో స్పెషలిస్ట్ డాక్టర్లు లేనందుకు వారిని నియమించేంత వరకు కార్మికులు, కుటుంబసభ్యులకు వైద్యం అందించేందుకు విజిటింగ్ స్పెషలిస్ట్ డాక్టర్లను రప్పించటం జరిగిందని, ఏఐటీయూసీ నాయకులు తెలిపారు. అదేవిధంగా దీనిని కొనసాగించాలని, ముందుస్తుగా ప్రచారం చేయాలని, అవసరమైన పేషంట్లకు అన్నిరకాల వైద్యపరీక్షలు ఇక్కడే నిర్వహించి సరిపడా మందులు అందించాలని కోరారు.

సమయపాలన పాటించని వైద్యులు..

సింగరేణి యాజమాన్యం కార్మికుల సంక్షేమం కోసం రూ.కోట్లు ఖర్చు చేస్తోందని గ్లోబల్ ప్రచారం చేస్తుంది కానీ, అది అమలు చేయకపోవడం గర్హనీయం. ఆదివారం సింగరేణి ప్రధానాసుపత్రిలో కార్మికులు, వారి కుటుంబ సభ్యుల సౌకార్యర్థం అన్ని విభాగాల స్పెషలిస్ట్ డాక్టర్ల క్యాంపు నిర్వహించారు. అయితే శిబిరానికి ఇల్లెందు, మణుగూరు, కొత్తగూడెం పరిసర ప్రాంతాల నుంచి సుమారు 400 మంది రోగులు ఉదయం 8 గంటలకే వచ్చారు. అయితే హైదరాబాద్ నుంచి వైద్యులు మాత్రం 12 గంటల తరువాత రావటం వారిని ఇబ్బంది పెట్టింది. వీరికి యాజమాన్యం కనీసం టీ, టిఫిన్, భోజనం ఏర్పాటు చేయకపోవటంతో దూర ప్రాంతాల నుంచి వచ్చిన వారు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. క్యాంపునకు వచ్చే వైద్యులు ముందురోజే వచ్చే విధంగా చూడాలని కార్మికులు, కార్మిక సంఘాల నాయకులు కోరుతున్నారు.

42 శాతం రిజర్వేషన్ కల్పించాలి



దిష్టిబొమ్మలను దహనం చేస్తున్న నాయకులు

సూపర్‌బజార్(కొత్తగూడెం): బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేస్తూ ఎన్ఎస్‌యూఐ ఆధ్వర్యంలో ప్రధానమంత్రి మోదీ, హోం మంత్రి అమిత్‌షా దిష్టిబొమ్మలను ఆదివారం బస్టాండ్ సెంటర్‌లోని తెలంగాణ అమరవీరుల స్తూపం ఎదుట దహనం చేశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు అజ్మీరా సురేష్ నాయక్ మాట్లాడుతూ... బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని, రాష్ట్రంలో చేసిన చట్టాలను రాష్ట్రపతి ఆమోదించాలని కోరుతూ కాంగ్రెస్ ప్రభుత్వ పెద్దల ఆధ్వర్యంలో ఢిల్లీలో ధర్నాలు చేసినట్లు తెలిపారు. కానీ కేంద్రంలోని బీజేపీ పెద్దలు బీసీ రిజర్వేషన్లకు అడ్డుగోడలుగా నిలుస్తున్నారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో షేక్ నయీమ్, షేక్ అజహర్, ఠాకూర్ రతన్‌సింగ్, షేక్ మోహిన్, కాటి సందీప్, ఉర్సు శివ, శరత్ తదితరులు పాల్గొన్నారు.

జానపద అకాడమీని ఏర్పాటు చేయండి..



మాట్లాడుతున్న పమ్మి రవి

కొత్తగూడెంటౌన్: ఆగస్టు 22వ తేదీని ప్రపంచ జానపద దినోత్సవంగా ప్రకటించాలని, నిర్వహణకు ప్రభుత్వం నిధులు ఏర్పాటు చేయాలని తెలంగాణ రాష్ట్ర జానపద కళాకారుల సంఘం రాష్ట్ర కార్యదర్శి పమ్మి రవి డిమాండ్ చేశారు. తెలంగాణ జానపద అకాడమీని [illegible] జిల్లా కళాకారుల సంఘం ఆధ్వర్యంలో రైటర్‌బస్తీలోని ప్రకృతి ఆశ్రమంలో ఆదివారం సమావేశం నిర్వహించారు. అకాడమీ రాష్ట్ర కార్యదర్శి పమ్మి రవి, జిల్లా అధ్యక్షుడు గద్దర్‌బాషా మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రంలో లక్షల మంది జానపద కళాకారులు ఉన్నారని, తెలంగాణ ఉద్యమంలో రాష్ట్ర సాధనకు జానపద కళాకారులు ఆటపాటలతో ప్రముఖ పాత్రను పోషించారని తెలిపారు. ప్రభుత్వం కళాకారులకు ఉపాధి మార్గం చూయించాలని కోరారు. ఈ సమావేశంలో జానకీరామ్, షేక్ ఖాసీం, కనకం కొమురయ్య, దాసరి వీరమోహన్, ప్రసన్న, తేలోతు కృష్ణ, విజయ్, లక్ష్మణ్, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

ప్రయాణికుల పరేషాన్



ఇల్లెందులో రోడ్డుపై పశువులు

ఇల్లెందు: పట్టణంలోని ప్రధాన రోడ్డుపై పశువుల సంచారం తీవ్రంగా ఉంది. వీటి వల్ల వాహన రాకపోకలకు తీవ్ర ఆటంకంగా మారింది. రేయింబవళ్లు రోడ్ల మీద ఎక్కడ పడితే అక్కడే తిష్ట వేస్తున్నాయి. ఒక్కోసారి పొట్లాడుకుంటూ షాపుల మీదకు, రోడ్డుపై వాహనాలకు తగలడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇంత జరుగుతున్నా సంబంధిత అధికారులు కానీ, పశువుల యజమానులు కానీ పట్టించుకోవడం లేదు. మున్సిపల్, పోలీస్ అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు.

అక్రమంగా ఇసుక నిల్వలు



రంగాపురం సమీపంలో నిల్వ చేసిన ఇసుక

పాల్వంచరూరల్: అక్రమార్కులు రాత్రి సమయంలో రంగాపురం వద్ద కిన్నెరసాని వాగు నుంచి ఇసుక తీసుకొచ్చి గ్రామ సమీపంలోని పలు ప్రదేశాల్లో నిల్వ చేశారు. వాటిని లారీలు, ట్రాక్టర్ల ద్వారా ఇతర ప్రాంతాలకు రవాణా చేసి సొమ్ము చేసుకుంటున్నారు. అధికారులకు సమాచారం ఇచ్చినా పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఈ విషయమై తహసీల్దార్ దారా ప్రసాద్‌ను వివరణ కోరగా... రంగాపురం, నాగారం వద్ద గల కిన్నెరసాని వాగు నుంచి ఇసుక అక్రమ రవాణాపై చర్యలు తీసుకుంటామన్నారు.

విక్రయ కేంద్రం ప్రారంభమెప్పుడో..?



చల్లసముద్రంలో అద్దెకు తీసుకున్న భవనం

ఇల్లెందురూరల్: యూరియా విక్రయాలను వ్యవసాయ మార్కెట్‌లో మాత్రమే ప్రారంభించడం అటు రైతులకు, ఇటు అధికారులకు ఇబ్బందిగా మారింది. రైతుల రద్దీ అధికంగా ఉండటం, దూర భారంతో వారు ఇబ్బంది పడటం వంటి కారణాలతో ఉన్నతాధికారుల ఆదేశం మేరకు మరో రెండు చోట్ల విక్రయ కేంద్రాలను ప్రారంభించాలని పీఏసీఎస్ అధికారులు నిర్ణయించారు. కొమరారం, చల్లసముద్రం కేంద్రంగా రెండు చోట్ల గదులను అద్దెకు తీసుకున్నారు. బోర్డులు సైతం రాయించి ముస్తాబు చేశారు. కానీ కొమరారం కేంద్రంగా మాత్రమే విక్రయ కేంద్రాన్ని ప్రారంభించారు. కానీ చల్లసముద్రంలో నేటికీ ప్రారంభించలేదు. దీంతో అటు అద్దె వృథా కావడంతోపాటు రైతుల ఇబ్బందులూ తొలిగిపోలేదు. ప్రస్తుతం వర్షాలు కురుస్తుండటంతో చల్లసముద్రం ప్రాంత రైతులు యూరియా కోసం ఇల్లెందుకు వచ్చి వ్యవసాయ మార్కెట్ విక్రయ కేంద్రం వద్ద క్యూలైన్లలో బారులు తీరాల్సి వస్తోంది. పీఏసీఎస్ అధికారులు తక్షణం స్పందించి అద్దెకు తీసుకున్న భవనంలో విక్రయ కేంద్రాన్ని వెంటనే ప్రారంభించాలని రైతులు కోరుతున్నారు.

సందడి చేసిన పూర్వ విద్యార్థులు



ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

పాల్వంచ: స్థానిక గట్టాయిగూడెం ప్రభుత్వ పాఠశాలలో 2002 – 03 లో ఏడవ తరగతి వరకు చదువుకున్న విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళన కార్యక్రమంలో సందడి చేశారు.

చిన్ననాటి మధుర జ్ఞాపకాలను నెమరవేసుకున్నారు. అనంతరం అప్పటి గురువులు జయ, రాంచందర్‌రావు, శివకుమారిలను సన్మానించారు. సహపంక్తి భోజనాలు చేశారు. కార్యక్రమంలో రాజేశ్, ఉస్మాన్, మనోజ్, సాయికుమార్, కృష్ణప్రసాద్, అనిల్, ఆనంద్, వంశీ, కార్తీక్, పృథ్వీ, మల్లికార్జున్, అరుణ, శిరీష, సౌజన్య, శ్రీలక్ష్మి, హసీన, సునీత తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా తీజ్ ఉత్సవం



తీజ్ బుట్టలతో బంజారా యువతులు

ఇల్లెందురూరల్: లంబాడా గిరిజనుల పవిత్రమైన తీజ్ ఉత్సవం పోచారంతండా గ్రామంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. వారంరోజులు కొనసాగిన ఈ వేడుకల్లో మొదటి రోజు యువతులు భక్తిశ్రద్ధలతో మొలకలు నాటారు. ప్రతీరోజు వాటికి ప్రత్యేక పూజలు చేసి చివరి రోజు ఆదివారం ఉపవాస దీక్షలుండి ఊరేగింపు నిర్వహించారు. అంతకు ముందు ఇంటి పెద్ద తలపాగలో మొలకలు ఉంచి ఆశీర్వాదం తీసుకున్నారు. ఈ సందర్భంగా తీజ్ బుట్టలతో సంప్రదాయబద్ధంగా ఆడిపాడారు. అనంతరం వాటిని తలపై పెట్టుకొని ఊరేగింపుగా వెళ్లి చెరువులో నిమజ్జనం చేశారు.

మహిళాశక్తితో ఆర్థిక స్వావలంబన

- స్వశక్తి మహిళా సభ్యులకు ఆర్థిక సాయం
- గత ఏడాది 68 యూనిట్లు మంజూరు



ఇందిరా మహిళాశక్తి పథకం కింద వేపలగడ్డలో ఏర్పాటు చేసిన నాటుకోళ్ల ఫాం

సుజాతనగర్: మహిళలు వ్యాపారాల్లో రాణించి ఆర్థికంగా ఎదిగేందుకు ప్రభుత్వం 'ఇందిరా మహిళా శక్తి'పథకానికి శ్రీకారం చుట్టింది. ఔత్సాహిక మహిళలను గుర్తించి బ్యాంకుల ద్వారా రుణం అందజేస్తోంది. దీని ద్వారా వ్యాపారాలు చేసుకునేలా అధికారులు కార్యాచరణ రూపొందిస్తున్నారు. ఇప్పటికే స్వశక్తి సంఘాలకు బ్యాంకు లింకేజీ, స్త్రీనిధి, రుణాలను అందిస్తుండగా మహిళాశక్తి పేరుతో మరింత ఆర్థిక సాయం చేసేందుకు చర్యలు తీసుకుంటున్నారు.

సబ్సిడీ రుణాలు..

సుజాతనగర్ మండలంలో 29 గ్రామ సంఘాలు ఉన్నాయి. వీటి పరిధిలోని 670 స్వయం సహాయక సంఘాల పరిధిలో 6,670 మంది మహిళలు సభ్యులుగా ఉన్నారు. ఇందిరా మహిళాశక్తి పథకం కింద మండల సమాఖ్య సంఘం సభ్యులకు బ్యాంకు లింకుతో వ్యాపారాలు చేసుకునేందుకు సబ్సిడీ రుణాలను అందిస్తుండగా... గత ఏడాది 68 యూనిట్లు గ్రౌండింగ్ చేసినట్లు సెర్ప్ అధికారులు తెలిపారు. సబ్సిడీ రుణాలతో గ్రామాల్లో పిండి గిర్నీలు, దాల్‌మిల్లు, కుట్టు మిషన్లు, స్టీల్ సామాన్ల వ్యాపారం, హోటళ్లు, జనరల్ స్టోర్లు, బ్యూటీ పార్లర్లు, బట్టల దుకాణాలు వంటివి నిర్వహించుకోవడానికి వీలుంటుంది. మహిళలు తమ కాళ్లపై తాము నిలబడి స్వయంగా వ్యాపారం చేసి ఆర్థికంగా నిలదొక్కుకునే సువర్ణ అవకాశాన్ని మహిళలు అందిపుచ్చుకుంటున్నారు.

68 యూనిట్లు గ్రౌండింగ్...

సుజాతనగర్ మండలంలోని 20 గ్రామ పంచాయతీల పరిధిలో గత ఏడాది 68 యూనిట్లను అధికారులు గ్రౌండింగ్ చేశారు. ఈ ఏడాది 170 యూనిట్ల ఏర్పాటుకు ప్రణాళికలు రూపొందించారు. అలాగే కేంద్ర ప్రభుత్వ పథకం ప్రధానమంత్రి సూక్ష్మ పరిశ్రమ (పీఎంఎఫ్ఎంఈ) కింద కూడా స్వయం సంఘాలకు రుణాలు మంజూరు చేసే అవకాశం ఉంది. దీంతో మహిళలు జీవనోపాధి పొంది ఆర్థికంగా నిలదొక్కుకునే అవకాశం ఉంది.

నాటుకోళ్ల పెంపకంతో ఉపాధి..



స్వయం సహాయక సంఘంలో సభ్యురాలిగా ఉన్నాను. ఇందిరా మహిళ శక్తి పథకం కింద రూ.ఒక లక్ష బ్యాంకు రుణం మంజూరైంది. నాటు కోళ్ల ఫారం పెట్టుకొని ఉపాధి పొందుతున్నాను. ఈ పథకం ఆర్థికంగా ఎదగడానికి ఎంతో ఉపయోగపడుతుంది.

– లింగం పద్మ, వేపలగడ్డ

సద్వినియోగం చేసుకోవాలి..



మహిళా సంఘాలు ఇందిరా మహిళ శక్తి, పీఎంఎఫ్ఎంఈ పథకాల ద్వారా బ్యాంకులు మంజూరు చేసే రుణాలను సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా రాణించాలి. గ్రామీణాభివృద్ధి సంస్థ ద్వారా మండల సమాఖ్య సంఘాలకు అనేక రకాల జీవనోపాధిని కల్పిస్తోంది.

– ఎస్.రాంబాబు, ఏపీఎం, సుజాతనగర్

గ్రామదేవతలకు ఘనంగా బోనాలు



ఇల్లెందురూరల్: మాణిక్యారంలో బోనంతో ఎమ్మెల్యే కోరం కనకయ్య

శ్రావణమాసం సందర్భంగా ఆదివారం పలు గ్రామాల్లో గ్రామదేవతలు బొడ్రాయి, పోచమ్మ, ముత్యాలమ్మలకు ప్రత్యేక పూజలు చేశారు. మహిళలు బోనాలు ఎత్తుకుని నృత్యాలు చేస్తూ ఊరేగింపుగా ఆలయాలకు వెళ్లి బోనాలు సమర్పించి, మొక్కులు చెల్లించుకున్నారు. ప్రజలందరూ ఆరోగ్యంగా ఉండాలని, వర్షాలు సమృద్ధిగా కురవాలని, పాడి పంటలు బాగుండే విధంగా చూడాలని అమ్మవార్లను వేడుకున్నారు. – సాక్షి నెట్‌వర్క్



ఇల్లెందు: ఇల్లెందులపాడులో..



పాల్వంచ: ఆలయంలో పూజ చేస్తున్న భక్తులు



పాల్వంచరూరల్: బోనాలతో వెళ్తున్న మహిళలు



జూలూరుపాడు: అనంతారంలో..